

బీజేపీ ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి బీజేపీ ఎమ్మెల్యే హరీశ్ పూంజాపై ఉప్పినంగడి పోలీసులు ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తెక్కారిలోని బట్రబైలు గోపాలకృష్ణ ఆలయంలో బ్రహ్మా కళశోత్సవ వేదికపై ఓ వర్గంపై అనుచితమైన వ్యాఖ్యలు చేశారని ఇబ్రహీం ముస్లింయార్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివాదంపై కేసు నమోదు చేశామనీ, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



ఎలక్ట్రానిక్ పరికరాలు పెట్టేవా.. దొరికిపోతావ్..



చెవి దుద్దులు.. తీయాల్సిందే..



హాల్ టిక్కెట్ సరే.. గుర్తింపు కార్డేదీ..?

నీట్‌గా..!


- సజావుగా ముగిసిన నీట్
- పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లేందుకు పలు ఆంక్షలు
- జంధ్యం తొలగింపుతో మరోసారి ఆందోళన

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) రాష్ట్రంలో సజావుగా జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలనుంచి 5 వరకు పరీక్షలు కొనసాగాయి. మధ్యాహ్నం 12 గంటలనుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. నీట్ నిబంధనలకు అనుగుణంగా అన్ని సెంటర్లలోనూ పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చెవిదిద్దులు, ముక్కుపుడకలు, వాచీలను తొలగించారు. కలబురగిలో ఓ విద్యార్థి జంధ్యం తొలగించడం వివాదమైంది. దీనిపై బ్రాహ్మణసంఘాలు ఆందోళన చేశాయి. ఈ సంఘటన మినహా రాష్ట్రవ్యాప్తంగా సజావుగా పరీక్షలు జరిగాయి.



కామరాజ్‌రోడ్డులోని పరీక్షా కేంద్రం వద్ద వేచివున్న అభ్యర్థులు..

ఇక ఇంటింటికే..!



- తీరనున్న దశాబ్దాల కల
- ఎస్సీ వర్గీకరణకు సిద్ధమైన సర్కార్
- గణాంకాల సేకరణకు ఏర్పాట్లు
- నేటి నుంచి 17వరకు సర్వే



సర్వే కోసం రూపు దిద్దుకున్న ప్రత్యేక యాప్



బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ సర్వేకు సర్వం సిద్ధమైంది. ప్రభుత్వం సర్వే చేసేందుకు అవసరమైన ఉద్యోగుల నియామకం, ప్రక్రియను పూర్తి చేసింది. ఎస్సీ కుల సంఘాలు సర్వేకు సన్నద్ధమయ్యాయి. ఎస్సీ కులాల వర్గీకరణ కల్పించే అధికారం రాష్ట్రప్రభుత్వాలదే అంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇలా దశాబ్దాలకాలంగా వర్గీకరణ కోసం చేస్తున్న దళిత సంఘాల పోరాటానికి ఒక మార్గదర్శకం లభించినట్లయ్యింది. వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేసేందుకు ముందుగా ఉపకులాల వర్గీకరణకు సంబంధించి సమగ్ర గణాంకాలు సేకరణకు సర్వే ప్రారంభం కానుంది. ఎస్సీ జాబితాలో ఉండే వారంతా సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ ప్రాధాన్యం తదితర స్థితిగతులపై సర్వే జరగనుంది. 5వ తేదీ సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి బృందాలు సర్వే చేస్తాయి. మే 19నుంచి 21 వరకు మూడు రోజులపాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి సర్వేలో అందుబాటులో లేని వారి సమాచారం సేకరిస్తారు. గ్రామస్థాయిలో సభలు జరుపుతారు. నికరమైన సమాచారం పొందుపరచాలని చైతన్యం కోసం గ్రామాలు, వార్డులు, ప్రాంతాలవారీగా చైతన్యం కల్పిస్తారు.

సర్వే విధానం

రాష్ట్రంలో ఏకకాలంలో సర్వే జరగనుంది. విద్యాశాఖ నుంచి 57వేలమంది ఉపాధ్యాయులను సర్వేకు కేటాయించారు. సర్వే చేసేవారికి గుర్తింపు కార్డులు అందజేస్తారు. సర్వే చేసేవేళ హడావుడి లేకుండా వారి సమగ్ర వివరాలను, ఎస్సీ కులంలోని ఉపకులాలను నమోదు చేసేలా వ్యవహరించాలని శిక్షణా శిబిరాలలో సూచించారు. శాస్త్రీయంగా జరుపుతున్న సర్వే కోసం మొబైల్ అప్లికేషన్‌ను సిద్ధం చేశారు. దాని ద్వారానే వివరాలు నమోదు చేస్తారు. ఓటరు జాబితాలో ఇళ్లసంఖ్య ఆధారాల ప్రకారం ఇంటింటికీ వెళ్లి ఎస్సీ కుటుంబాల గుర్తించే ప్రక్రియ జరగనుంది. ఎస్సీ కుటుంబంలోని ప్రతి సభ్యుడి సమాచారాన్ని మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి ద్వారాగానీ, లేదా ప్రాంతాలవారీగా ఉండే సంఘాల ద్వారాగానీ సమాచారాన్ని సేకరించరు. నేరుగా ప్రతి వ్యక్తి వివరాలను వారి ద్వారానే సేకరిస్తారు.

ప్రత్యేకతలు

కులాంతర వివాహాలు చేసుకున్నవారిలో భార్య లేదా కోడలు వేరే కులానికి చెందినవారు ఉండవచ్చు. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం పొందారా లేదా అని సేకరించాలి. రాష్ట్రంలో ఎస్సీ కులాల జాబితాను సిద్ధం చేసి అనుబంధంగా 2ఏలో పొందుపరిచారు. తద్వారా ఎస్సీకులాల జాబితాలో ఉండే పేర్లకు అనుగుణంగా మాత్రమే సమీక్ష చేస్తారు. ఎవరైనా తాము ఎస్సీకులానికి చెందినవారమని నమోదు చేయాలని డిమాండ్ చేస్తే వారి మూల కులాన్ని గుర్తించి సేకరించాల్సి ఉంటుంది. ఎస్సీ జాబితాలో క్రమసంఖ్య 1లో ఆదిఆంధ్ర, 2 ఆదిద్రావిడ, 3 ఆది కర్ణాటకగా నమోదు చేసినవి మూలకులాలు కావు. ఇవి జాతుల గుంపుగా భావిస్తూ మూలకులాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. 101 మూలజాతి ఉపకులాలకు సంబంధించి ప్రత్యేక వివరాలు పొందుపరిచారు. కులంపేరు మొబైల్ అప్లికేషన్‌లో లభ్యం కానుంది. అందులో ఒకదాన్ని మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. డోంట్ అనే అవకాశం కూడా ఉంది. అభ్యంతరాలు ఉంటే అవకాశాన్ని తొలగించాలనే డిమాండ్ చేయవచ్చు. ఇందుకు సంబంధించి కమిషన్ నిర్ణయం తీసుకోనుంది. సర్వేద్వారా విద్య, సామాజిక వ్యత్యాసం కలిగి ఉండడం, శౌచాలయాల వ్యవస్థ, ఇల్లు, వంటగ్యాస్, ఇంటి వెలుగు కోసం ఉపయోగించే విధానం, వలస నుంచి వచ్చిన స్థలం, ఇంటి యజమాని, ప్రభుత్వం నుంచి పొందిన సౌలభ్యాలు, చరాస్థులు, పశువులు, భూములు, కుటుంబం చేసిన అప్పులు, రాజకీయ ప్రాతినిధ్యం, వార్షిక ఆదాయం, రిజర్వేషన్ సౌలభ్యం, హాస్టల్ సౌలభ్యం, వృత్తి, వైవాహిక సంబంధాల గురించి సమాచారాన్ని సేకరిస్తారు.

సర్వే విధానాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక పరిశీలకులను నియమించారు. సర్వే కొనసాగించేవారు నమోదు చేసిన సమాచారానికి అనుగుణంగా కనీసం 10శాతం కుటుంబీకులను పరిశీలకులు క్రాస్‌చెక్ చేస్తారు. తద్వారా సర్వేలో తప్పులు జరిగితే అప్పటికప్పుడు సరిదిద్దవచ్చుననేది ప్రధాన ఉద్దేశం.

సర్వే చేసేవారు ఇంటి పెద్ద ఓటరుకార్డు క్రమసంఖ్యను నమోదుచేసి ఆతర్వాత ఎస్సీ జాబితాకు చెందినవారైతే రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు సంఖ్యను నమోదు చేస్తారు. రేషన్‌కార్డు సంఖ్య నమోదు చేసి కార్డులోని డేటా ప్రకారం మొబైల్‌లో నమోదు చేస్తారు. రేషన్‌కార్డులో పేర్లు లేకున్నా సర్వేలో పొందుపరిచేందుకు అవకాశం ఉంది.

మూడు దశాబ్దాల పోరాటం..

మూడు దశాబ్దాల పోరాటానికి ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. మాదిగ కులస్థులంతా సర్వేలో పాల్గొని సమగ్ర వివరాలను పొందుపరచాలని మాజీ మంత్రి హెచ్ ఆంజనేయ కోరారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో లిడ్కర్ భవనంలో మాదిగ ముఖ్యుల చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే వేళ మా కులం మాదిగ అని నమోదు చేయించాలని కరపత్రాలను, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్రమంతటా వాటి ద్వారా ప్రచారం చేయదలిచారు. రాష్ట్రంలో ఎస్సీ కులంలో మా వర్గం పెరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని, వాస్తవానికి మాదిగల సంఖ్య అధికమని అయితే చైతన్యం లేని కారణంగా వెనుకబడ్డామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ మాదిగలందరూ వర్గీకరణ సర్వేలో సమగ్ర వివరాలు పొందుపరచాలని కోరారు.



హావేరి జిల్లాలో ప్రసంగిస్తున్న సీఎం సిద్ధరామయ్య

గోవాకు భయపడే.. మహదాయికి

బ్రేక్..!

- ప్రధాని మోదీపై సీఎం ఫైర్

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటకకు జీవనాడి అయిన మహదాయి ప్రాజెక్టుకు అనుమతులు ఇప్పించే విషయంలో గోవా రాష్ట్రానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ భయపడుతున్నారని సీఎం సిద్ధరామయ్య మండిపడ్డారు. ఆదివారం హుబ్బళ్ళి ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ఉత్తర కర్ణాటకకు మహదాయి ప్రాజెక్టు కీలకమైనదన్నారు. మహదాయి ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ నుంచి ఎందుకు అనుమతులు ఇప్పించడం లేదన్నారు. గోవాకు చెందిన బీజేపీ నాయకులు అనుమతులు ఇప్పించకుండా అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్రం నుంచి పలుమార్లు కేంద్రానికి సమస్యలు వివరించామన్నారు. కాగా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఎందుకు ఈ విషయంలో చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. సంఘవిద్రోహశక్తులను అణిచివేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయదలిచామని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. తీరప్రాంత జిల్లాల్లో మతఘర్షణలు పెరుగుతున్నాయన్నారు. మంగళూరులో ఫాజిల్ హత్యకు గురైనప్పుడు కుటుంబీకులకు ఇచ్చిన రూ.25లక్షల పరిహారంలోనే అతడి సోదరుడు రూ.5లక్షల సుపారీ ఇచ్చి హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టిని హత్య చేయించారనే ఆరోపణపై హోం మంత్రి పరమేశ్వర్ వెళ్లారని వివరాలు తెలుసుకున్నాక మాట్లాడతానన్నారు. పాకిస్థాన్ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందంటూ ఇటీవల మాజీ ప్రధాని దేవెగౌడ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. దేవెగౌడ బీజేపీలోకి వెళ్లేముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఎన్ని వ్యాఖ్యలు చేశారో పరిశీలించుకుంటే బాగుంటుందన్నారు. అనంతరం హావేరి జిల్లా హానగల్‌లో జరిగిన బహిరంగసభలో సీఎం మాట్లాడుతూ హావేరి సాంస్కృతిక, ఆధ్యాత్మికంగా గుర్తింపు కల్గిన ప్రాంతమన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అబద్ధాలు చెప్పడంలో నేర్పరి అన్నారు. ఇప్పటివరకు ఒక్క హామీని కూడా ప్రధాని నెరవేర్చలేదన్నారు. హావేరి జిల్లాలో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. 5 గ్యారెంటీ పథకాలను అమలు చేశామన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు ఖజానా ఖాళీ అన్నారని, అయితే గ్యారెంటీలతోపాటు అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. బీజేపీ నేతలు అశోక్, విజయేంద్రలు నకిలీ జనాక్రోశ యాత్ర చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. అక్కిఆలూరులో ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌ను సీఎం ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రి శివానంద పాటిల్, విధానపరిషత్ చీఫ్ విప్ సలీం అహ్మద్, ఎమ్మెల్యేలు శ్రీనివాసమానె, ప్రకాశ్ కోళివాడ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సీఎం సిద్ధరామయ్య

డీకే శివకుమార్‌ను సీఎం చేయాలంటూ నినాదాలు

- సున్నితంగా మందలించిన సీఎం

డీసీఎం డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని హానగల్‌లో కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. బహిరంగసభలో ఎవరు ఏ విషయమై ప్రసంగిస్తున్నారో తెలియని గందరగోళం నెలకొంది. వ్యక్తిగత సిబ్బంది ద్వారా తెలుసుకున్న సీఎం సిద్ధరామయ్య సున్నితంగా మందలించారు. ఇలాంటివి బహిరంగంగా నినాదాలు చేయరాదన్నారు. తమది హైకమాండ్ పార్టీ అని, ఏ విషయమైనా ఢిల్లీ నేతలు నిర్ణయిస్తారన్నారు. ఏ మార్పులు జరగాలన్నా వారిదే అంతిమ నిర్ణయమంటూ మందలించారు.



కుడితిని జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్తున్న రైతులు

మా భూములు మాకివ్వండి..!

- 13 సంవత్సరాలైనా కర్మాగారాలు ఏర్పాటు చేయలేదు
- జాతీయ రహదారిని దిగ్బంధించిన రైతులు

6

బైక్‌ను ఢీకొన్న పోలీస్ జీపు

- ఒకరికి తీవ్రగాయాలు

7

29న కైవార తాతయ్య ఆరాధన

7

చిత్రావతి కాలువలో

కాలుష్యం..!

- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

21 రోజుల తర్వాత

ఖననం

- ఎన్‌కౌంటర్ మృతుడికి అంత్యక్రియలు
- అచూకీ దొరక్కపోవడంతో అధికారుల ఆధ్వర్యంలోనే ముగింపు

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో ఐదేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన పాట్నా నివాసి రితీశ్‌కుమార్‌ను ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. రితీశ్‌కుమార్‌కు శనివారం హుబ్బళ్ళిలో అంత్యక్రియలు జరిపారు. ఏప్రిల్ 13న బాలికపై హత్యాచారానికి పాల్పడ్డాడు. విచారణకు తీసుకెళ్తుండగా పరాయ్యే ప్రయత్నం చేసిన మేరకు ఎన్‌కౌంటర్ చేశారు. కోర్టు సూచనల కోసం వేచిచూసి తీర్పు రావడంతో అంత్యక్రియలు జరిపారు. అతడికి సంబంధించిన బంధువుల కోసం బీహార్‌తోపాటు దేశవ్యాప్తంగా పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విచారణాధికారులు మృతదేహాన్ని హుబ్బళ్ళి మహానగర పాలికెకు అప్పగించారు. తహసీల్దార్, సీఐడీ అధికారులు, మహానగర పాలికె సిబ్బంది సమక్షంలో అంత్యక్రియలు ముగించారు.

గజ(ల) విహారం..!

చామరాజనగర జిల్లా హనూరు తాలూకా సరిహద్దులోని పాలార్ సమీపంలోని ఓ చెరువులో 8 గజరాజులు ఎండ వేడిమి తాళలేక సేద తీరుతూ కనిపించాయి. మామూలుగా దాహం తీర్చుకున్నాక తిరిగి అడవుల్లోకి వెళ్లాయి..కానీ అధిక వేడి కారణంగా ఇలా గడుపుతున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నాయి. ఏనుగులకు సంబంధించిన దృశ్యాలు రెండురోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. (బెంగళూరు, ఆంధ్రజ్యోతి)




చెరువులో సేద తీరుతున్న గజరాజులు

నీ ఏరియాలోనే..

చంపేస్తాం..!

- సుహాస్‌శెట్టి హత్య తర్వాత మరో హిందూ కార్యకర్తకు బెదిరింపులు
- సోషల్ మీడియాలో పోస్టులతో కలకలం

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మంగళూరులో హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి దారుణహత్య మరువకముందే మరో హిందూ కార్యకర్త హత్యకు కుట్ర పన్నారు. సోమవారం హతమారుస్తామని సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యింది. భరత్ కుమ్డేల్‌కు ప్రాణాలు తీస్తామంటూ హెచ్చరించారు. మే 5న రాత్రి 9.30 గంటలకు నీ ప్రదేశంలోనే హతమారుస్తామని పోస్టు చేశారు. 2017 జూన్ 21న ఎస్‌డీపీఐలో కీలకంగా వ్యవహరించిన అష్రఫ్ తలాయి హత్యకేసులో భరత్ కుమ్డేల్ నిందితుడిగా ఉన్నాడు. అష్రఫ్ హత్యానంతరమే బంట్వాళకు చెందిన శరత్ మడివాళ హత్య జరిగింది. తాజాగా సుహాస్‌శెట్టి హత్య జరిగిన తర్వాత భరత్ కుమ్డేల్, శరణ్ పంప్‌వెల్‌లకు బెదిరింపులు వచ్చాయి. నెక్స్ట్ టార్గెట్ నీవేనంటూ సోషల్‌మీడియాలో ఆదివారం పోస్టు చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.34	1,577.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	606	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	142	138
నీటి నిల్వ (టీఎంసీలు)	6.90	3.55

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప

బళ్లారి సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని బెళగల్ రోడ్డులో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. మానసిక దివ్యాంగుల పిల్లల కోసం చెంగారెడ్డి మెమోరియల్ రెసిడెన్సియల్ స్పెషల్ స్కూల్లో 21 విభిన్న వైకల్యాలు ప్రభావంతమైన బోధనా శిక్షణ అంశాలపై ప్రత్యేక ఉపాధ్యాయుల కోసం ఈ శిక్షణను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి 120మందికి పైగా ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిబిరాన్ని ప్రారంభించిన బళ్లారి జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి శ్రీ.హెచ్, గోవిందప్ప మాట్లాడుతూ.. ప్రత్యేక విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇటువంటి శిబిరాలు చాలా ఉపయోగకరమన్నారు. ఎందుకంటే అవి వృత్తిపరమైన జ్ఞానం నైపుణ్యాలను అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి కళానికేతన్ విద్యాసంస్థ పరిపాలనా అధికారి గురుమూర్తి మాట్లాడుతూ ఈ శిబిరాలు ప్రత్యేకంగా ప్రతిభావంతుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. ఈసందర్భంగా చంగారెడ్డి మెమోరియల్ స్పెషల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రత్యేక ఉపాధ్యాయుడు లోకేశ్ రావు, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విస్డమ్ ల్యాండ్ విద్యార్థి ప్రతిభ



బళ్లారిరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సిడిగినమల గ్రామానికి చెందిన గూలెప్ప, భాగ్యమ్మల కుమారుడు హర్ష తాలూకాలో ప్రథమ సాధించి ప్రతిభ చాటాడు. బళ్లారి విస్డమ్ ల్యాండ్ స్కూల్లో చదువుతున్న ఈ విద్యార్థి 625కి 600 సాధించడంపై స్కూలు యాజమాన్యం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గంధపు చెట్ల నరికివేత



నరికివేసిన గంధపు చెట్టు మొదలు

బళ్లారి సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి):విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని కోడిహళ్లి గ్రామ శివార్లలో రాత్రి కొందరు దుండగులు లక్షల రుపాయల విలువైన గంధపు చెట్లను నరికి దొంగిలించారు. గ్రామానికి చెందిన రైతు సుధీర్‌వర్మతన పొలంలో గంధపు చెట్లను పెంచాడు. దొంగలు ఏడు, ఎనిమిది సంవత్సరాల వయస్సు గల 15కుపైగా అధిక చెట్లను నరికివేశారు. నలుగురు వ్యక్తుల బృందం తోటలోకి చొరబడి చెట్లను నరికి తీసుకెళ్లడం సీసీటీవీ కెమెరాలో రికార్డైంది. తంబ్రహళ్ళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అటవీ శాఖకు సమాచారం అందించామని రైతు సుధీర్ తెలిపారు.

మా భూములు మాకివ్వండి..!

● రైతుల డిమాండ్.. భారీ నిరసన ప్రదర్శన



రోడ్డుపై బైఠాయించిన రైతులు

కంప్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): కుడితిని పరిధిలోని హరిగిణదోణి, జానెకుంటి, వేణి వీరాపురం, కుడితిని, కొలగల్లు,యర్రంగిలి గ్రామాల రైతులు కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకున్న రైతులు రోడ్డెక్కారు. 835 రోజులుగా న్యాయం కోసం నిరసన చేపట్టినా ఫలితం లేకపోవడంతో కుడితిని వద్ద హైవేపై 63 సంఘ సంస్థ నేతలు రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు నాయకులు బసవరాజు మాట్లాడుతూ గ్రామాల పరిధిలో కర్మాగారాలు ఏర్పడితే తమ పిల్లలకు మేలు జరగుతుందని, తమ భూములు తక్కువ ధరకే ఇచ్చామన్నారు. నాలుగు వేల ఎకరాలకు పైగా భూములు తీసుకుని సుమారు 13 సంవత్సరాలవుతున్నా ఎటువంటి కర్మాగారాలు ఏర్పాటు చేయలేదన్నారు. భూములు పోగొట్టుకుని సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఏ నాయకుడు తమ గోడు పట్టించుకోలేదన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే అన్నపూర్ణ కేవలం నిరసన వద్ద వచ్చి పలకరించి వెళ్లారని, ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ అక్కడికి చేరుకుని రైతు నాయకులతో చర్చించారు. త్వరలోనే తమ న్యాయం చేకూరుస్తామని తెలిపారు. అయినా వారు వినకపోవడంతో జిల్లా అధికారితో ఫోన్లో మాట్లాడిన వారం రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి తమకు ముఖ్యమంత్రులతో కలిసేందుకు ఒక తేదిని నిర్ణయిస్తామన్నారు. దీంతో రైతులు శాంతించి రాస్తారోకో విరమించుకున్నారు. అనంతరం స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ 116 ఎకరాలు కూడా కేడీపీ తీసుకుని ఇంతవరకు రైతులకు న్యాయం చేయలేదన్నారు. తిరిగి వారి పొలాల వారికైనా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలంపనిలో ఇప్పటికీ కేడీపీ వస్తుందన్నారు. రైతులకు న్యాయం చేకూర్చాలన్నారు. ఈ రాస్తారోకోలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీబందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు, శివశంకర్, తిప్పేస్వామి, జంగ్లీసాబ్, తిమ్మప్ప, సంపత్, గంగాధర, ఆనంద్, వెంకటరమణబాబు, బసవరాజు, తిమ్మప్ప, రామలింగప్ప, వరలక్ష్మీ, శాంతమ్మ, లింగమ్మ గ్రామాల రైతన్నలు సంఘ సంస్థ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కంప్లిలో ఊరేగింపులో పాల్గొన్న ఉప్పర సమాజ ప్రజలు

బళ్లారిరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో భగీరథ మహర్షి జయంతిని ఉప్పర కులబంధువుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరాములు, భగీరథ మహర్షి వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఉప్పర కమ్యూనిటీ పిల్లలకు విద్యనివ్వాలని ప్రభుత్వ సౌకర్యాలను సమర్థవంతంగా అందుబాటులోకి తీసుకురావాలని, విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకు వస్తామన్నారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి చిత్రపటాన్ని నగరంలో పెద్దఎత్తున ఊరేగింపుగా అదే విధంగా ఈ ర్యాలీని కాకి పార్కు నుంచి రాయల్ సర్కిల్ బెంగళూరు, బ్రూస్‌పేట సర్కిల్, తేరు బజారు మీదుగా రంగ మందిర చేరుకుని దొడ్డనగౌడ మందిరం వేదిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కొప్పళ జిల్లా అధ్యక్షుడు హనుమేష్, ఉప్పర నౌకరర్ల సంఘం అధ్యక్షుడు మల్లప్ప, ఉమెన్ రైట్స్ స్టేట్స్ అధ్యక్షుడు డాక్టర్ ఉరుకుందరెడ్డి, నాగేంద్ర, సంగనల్ కృష్ణ, తిమ్మప్ప, నాగరాజు, వెంకటేష్, యర్రిస్వామి, దుర్గేష్, ఉప్పర కులబాంధువులు పాల్గొన్నారు.

కంప్లి: కంప్లి, కురుగోడు పట్టణాల్లో భగీరథ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో భగీరథ భావ చిత్రపటానికి పుష్పాలతో అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉప్పర సమాజంలో ప్రతి ఒక్కరు భగీరథున్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన నిదర్శనాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రప్ప, మహేష్, మంజు, దొడ్డబసప్ప, వెంకటేష్, నాగరాజు, భీమా, జనప్ప, హనుమేష్, ఈరన్న, బసవ గురుమూర్తి, రాఘవేంద్ర, ఉప్పర సమాజం పదాధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు : జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ మరియు సాంస్కృతిక శాఖ, జిల్లా ఉప్పార సమాజం సంయుక్త ధ్వార్యంలో నగరంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని రంగమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ ప్రారంభించి మాట్లాడారు.

రిజర్వేషన్‌పై అవగాహన

బళ్లారి సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలకు అంతర్గత రిజర్వేషన్ కల్పించేందుకు సోమవారం నుంచి కుల సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం నగరంలోని చలువాది వీధిలో సంఘం నాయకులు ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చలువాది సంఘం నాయకులు సూరి మాట్లాడుతూ సర్వేపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు వచ్చిన సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. పలు విషయాలపై ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించడానికి కరపత్రాలను పంపిణీ చేశారు. అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఓటరు ఐడీతో సహా దగ్గర ఉంచుకోవాలన్నారు. షెడ్యూల్డ్ కులాన్ని కుల కాలమ్‌లో నమోదు చేయాలని, చలవాదిని అసలు కుల కాలమ్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ కులాలకు అంతర్గత రిజర్వేషన్ల కోసం దశాబ్దాలుగా పోరాటం జరుగుతోందన్నారు. సమాజం యొక్క సామాజిక, విద్యా ,వృత్తిపరమైన ఆర్థిక అభివృద్ధికి అంతర్గత రిజర్వేషన్ సర్వే కీలకమైనదన్నారు. సర్వే తరువాత అందులో గణాంకాల ఆధారంగా కమ్యూనిటీ అంతర్గత రిజర్వేషన్ శాతాన్ని పొందవచ్చన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ అసలు కులాన్ని ఆది కర్ణాటక, ఆది ఆంధ్ర, ఆది ద్రవిడ అని రాయకూడదని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఉద్యోగుల సంఘం సభ్యులు విలాస్ మాన్కర్, న్యాయ సలహాదారు ఈశ్వర్‌రావు, జంబయ్య, బసవరాజ్, సంఘం నాయకులు శ్రీనివాస్, శివకుమార్, శేఖర్, రంగయ్య, గోనాల్ మానయ్య, మల్లికార్జున, కప్పగల్లు లోకేశ్, గాదిలింగ పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చలువాది సంఘం నాయకులు



'చుంబక గాలి' పుస్తకాన్ని అవిష్కరిస్తున్న రచయితలు

రచయిత అభిమానించే ప్రచురణకర్త చన్నబసవన్న

బళ్లారి సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రచురణకర్త చన్న బసవన్న తన లోహియా పబ్లికేషన్ ద్వారా రచయితలకు స్ఫూర్తినిచ్చారని, రచయితలను గౌరవంగా చూసిన ప్రచురణకర్త మరొకరు లేరు అని రచయిత్రి సవితా నాగభూషణ్ అన్నారు. నగరంలోని రాఘవ కళామందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రచురణకర్త చన్నబసవన్న లక్షణాలపై రూపొందించిన వ్యాసాల సంకలనం 'చుంబక గాలి' పుస్తకాన్ని అవిష్కరించి మాట్లాడారు. చన్నబసప్ప గాంధీ, బసవ, తన ప్రచురణ సంస్థల ద్వారా ఆయన ప్రచురించిన పుస్తకాలు దేశంలో జ్ఞానాన్ని విస్తరించాయన్నారు. న్యూఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ కన్నడ సలహా బోర్డు సభ్యుడు చిదానంద సాలి మాట్లాడుతూ ఆయన బెంగళూరు వెలుపల బళ్లారి కేంద్రంగా ఒక ప్రచురణను నిర్మించారు. ప్రచురణ కర్తగా ఆయన సాధించిన విజయాలను కన్నడనాడు మరచిపోదన్నారు. పాఠకులకు అనుకూలమైన ప్రచురణకర్త చన్నబసవన్న అన్నారు. మార్కెట్ లేదని వారు కథనాలు ప్రచురించారు. చాలా మంది రచయితలుగా మారడం వెనుక ఆయన సహకారం ఉందని, ఆయనదేశ ప్రకటిత సాంస్కృతిక చరిత్రకారుడు. వారు బహిరంగంగా కీర్తించడాన్ని అంగీకరించరు. వారికి ఆత్మకథలు ఇష్టం ఉండదు. అయితే వారు తమ ఆత్మకథ రాయాలి ఇది కర్ణాటక గురించి పుస్తకాల సమాహారం అవుతుంది. దీనికి సాంస్కృతిక ప్రాముఖ్యత ఉంటుందన్నారు. కువెంపు భాషా బారతి అదికారి సభ్యుడు జాజి దేవేంద్రప్ప మాట్లాడుతూ చన్నబసవన్న కన్నడ అభిమాని ఆంధ్రలో కోల్పోయిన కన్నడప్రాంతాల పట్ల ఆయనకు అపారమైన ప్రేమ ఉందన్నారు. పుస్తకాలు చదడంతోపాటు పర్యావరణ సంరక్షణ అందరి ధ్యేయం కావాలన్నారు. బళ్లారి, కొప్పళలో అనేక పర్యావరణ సవాళ్లు ఉన్నాయి. ఇక్కడి ప్రజలు పర్యావరణం పట్లశ్రద్ధ వహిస్తారు. ఇక్కడ జరుగుతున్న పర్యావరణ నష్టాన్ని అందరూ ఎదుర్కోవాలి అని ఆయన చెప్పారు. ఈసందర్భంగా ప్రచురణకర్త చన్నబసవన్న రచితల గురించి మాట్లాడారు. సండూరు విరక్తమఠం ప్రభుస్వామి, జర్నలిస్ట్ మంజునాథ్, శశిధర్ మేటి తదితరులు పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సభ్యులు

తోరణగల్లు, మే 4(ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకాలో లైంగిక దౌర్జన్యానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, అమ్మాయి కుటుంబానికి రక్షణ, రూ. 25 లక్షలు పరిహారం చెల్లించాలని, ఆదివారం ఎస్ఎఫ్ఐ సంచలన సమితి, డీవైఎస్పీ గోకుల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పదాధికారులు మాట్లాడుతూ తాళూరు ఇతర గ్రామాల్లో పాఠశాల దూరంగా ఉన్నాయని పాఠశాలల ముందు అమ్మాయిలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తాలుకా సంచాలక శివారెడ్డి, ఎస్ఎఫ్ఐ పదాధికారులు అక్షయ్‌కుమార్, శంకర్, సీఐటీయు నౌకర్ల సంఘం తాలుకా అధ్యక్షురాలు ద్రాక్షాయణి, డీవైఎఫ్ఐ జిల్లా పదాధికారి కాలుబా, డీవైఎఫ్ఐ తాలుకా అధ్యక్షులు షరీఫ్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో శారదానికేతన్ సత్తా



నిఖితారెడ్డి | విజయ | వరుణ్ | ప్రభశ్రీ | వగ్గొట్టు

కంప్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదా నికేతన్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. 90 శాతం ఉత్తీర్ణత ఫలితాంశాలు వచ్చాయని పాఠశాల వ్యవస్థాపకులు కే పవన్ కుమార్ రెడ్డి, కే విజయ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. 30 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ముగ్గురు మాత్రం వేలూరు అయినట్లు తెలిపారు. అందులో ఆరు మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో 18 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, ఒక విద్యార్థి ద్వితీయ శ్రేణిలో, ఇద్దరు విద్యార్థులు సాధారణ తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. నిఖితారెడ్డి 607 మార్కులు, కే విజయ 600, వరుణ్ 593, ప్రభశ్రీ 578, వజాహత్ ఎక్కా 566 మార్కులు సాధించారు.

సండూరులో భారీ వర్షం

తోరణగల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): సండూరులో శనివారం రాత్రి జోరు వాన కురిసింది. 27.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. చోర్నూరు ప్రాంతంలో 18.2 మిల్లీమీటర్లు, కురేకుప్ప ప్రాంతంలో 49.0 మిల్లీమీటర్లు, విఠలాపురంలో 53.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారి మంజునాథ తెలిపారు.

రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎంపీ రాజశేఖర్ యత్నాల్, ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మే 4 (ఆంధ్రజ్యోతి): రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన తారు రోడ్డు పనులకు కొప్పళ ఎంపీ రాజశేఖర్ యత్నాల్, ఎమ్మెల్యే బీఎం నాగరాజ ఆదివారం భూమిపూజ చేశారు. తాలుకాలోని ఇబ్రహీంపురం గ్రామంలో చిందనూరు ప్రధాన రహదారి నుంచి జానప్పగౌడ పొలం వరకు వెళ్లే లింకు రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షుడు కరిబసప్ప, ఉమేష్ గౌడ, పవన్‌కుమార్ దేశాయ్, కౌన్సిలర్లు ధనుష్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

7న రాజ్యాంగ రక్షణ ఆందోళన

ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ

రాయచూరు, మే 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ మహెంగాయి హఠావో పేరుతో ఈ నెల 7వ తేదీన రాయచూరు నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ తెలిపారు. ఆదివారం సింధనూరులోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను నిరశిస్తు చేపట్టే ఈ బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏఐసీసీ కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలతోపాటు పలువురు మంత్రులు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొంటారన్నారు. సింధనూరు నియోజక వర్గం నుంచి 5వేల మంది కార్యకర్తలు, నాయకులు సభలో పాల్గొంటారన్నారు.

హోసూరు జోన్

నీట్‌కు 4,416 మంది హాజరు



పరీక్షాకేంద్రం వద్ద వేచివున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కృష్ణగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్ పరీక్షకు కృష్ణగిరి జిల్లాలో 4,416మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5వరకు పరీక్ష జరిగింది. ఇందులో ఉత్తీర్ణులైనవారు ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో చేరనున్నారు. ఉత్తంగరై ప్రభుత్వ బాలుర హయ్యర సెకండరీ పాఠశాలలో 360మంది, బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో 480మంది, కావేరిపట్నం ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాల, శూలగిరి ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాల, హోసూరు ముల్లైనగర్ ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాల, ఇతర పాఠశాల మొత్తం 9 కేంద్రాలలో పరీక్షలు సాగాయి. 12.30 గంటలకే అభ్యర్థులు పరీక్షాకేంద్రానికి చేరుకునేలా అవకాశం కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు ప్రవేశానికి పలు ఆంక్షలు విధించారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



అయ్యప్ప బళ్ళారి (ఫైల్)

రాయచూరు, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ పట్టణ పరిసరాల్లోని ఆశిహాళ గ్రామానికి చెందిన రైతు అయ్యప్ప బళ్ళారి(55) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాద భరించలేకనే ఇతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ట్రాక్టర్ కొనుగోలు కోసం సహకార బ్యాంకులో ఏడు లక్షలు రుణం తీసుకున్న అయ్యప్ప, ఫైనాన్సు బ్యాంకులోను దాదాపు రూ.8 లక్షల వరకు అప్పు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ అప్పు సకాలంలో తీర్చకపోవడంతో ఏటికేడు వడ్డీ పెరుగుతుండడంతో ఆందోళ చెందిన రైతు అప్పు తీర్చే మార్గంకానరాక ఆదివారం ఉదయం తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూపోలీస్ శాఖ అధికారులు పరిశీలించారు.



నివాళి అర్పిస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

హిందూ కార్యకర్తకు నివాళి

హోసూరు, మే 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం మంగళూరులో హత్యకు గురైన హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి మృతి పట్ల విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హోసూరు నగరంలో ఆదివారం నివాళులు అర్పించారు. హిందూ కార్యకర్తలకు రక్షణ కరువైందని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేశారు. హిందూ కార్యకర్తలకు రక్షణ కల్పించాలన్నారు. నగరంలో రాష్ట్ర నిర్వాహకుడు కిరణ్, జిల్లా నిర్వాహకుడు లోకేశ్ నేతృత్వంలో నివాళులు అర్పించారు. డివిజన్ ఇన్‌చార్జ్‌లు దేవరాజ్, కృష్ణ, జిల్లా అధ్యక్షుడు శాంతకుమార్, సందీప్, మంజురామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ..




మాట్లాడుతున్న మురళీమోహన్

హోసూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం ఆదివారం పుష్పాంజలి ఘటించారు. హిందూ జనసేన సంస్థ అధ్యక్షుడు మురళీమోహన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రవాదుల దాడిని సహించరాదన్నారు. దేశంలో ఉంటున్న పాకిస్థానీయులను తిప్పిపంపేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందుకు అందరూ సహకరించాలన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాద దాడికి అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీకి దేశప్రజలంతా మద్దతు ఇవ్వాలన్నారు. ఉగ్రదాడులను అన్ని పార్టీలు ఖండించాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కార్ల్‌మార్క్స్ (జయంతి)



జర్మన్ దేశానికి చెందిన తత్వవేత్త కార్ల్ హెన్‌రిచ్ మార్క్స్ 1818 మే 5న జన్మించారు. ఆర్థిక వేత్తగా, సామాజికవేత్తగా, రాజకీయనేతగా రాణించినా సోషలిస్టు విప్లవకారుడిగా పేరొందారు. యూరోపియన్ నగరాలన్నింటిలోని విప్లవ సమూహాలన్నీ 1847లో కమ్యూనిస్టు లీగ్‌గా ఏకీకృతం కాగా మార్క్స్, ఎంగెల్స్ ఈ కమ్యూనిస్టు లీగ్‌కు సైద్ధాంతిక సూత్రీకరణలను తయారు చేశారు. అలా చరిత్రలో ఆధునిక సోషలిస్టు సిద్ధాంతం శాస్త్రీయంగా ప్రకటించబడింది. 1883 మార్చి 14న కన్నుమూశారు.

టీఆర్ రాజకుమారి (జయంతి)



తంజావూరు రంగనాయకి రజాయి 1922 మే 5న జన్మించారు. టీఆర్ రాజకుమారిగా పేరొందారు. దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమలో 'డ్రీమ్ గర్ల్' అని పిలిపించుకున్న తొలి నటి. ఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో 'వసంత సేన' పాత్రలో జీవించింది. ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నాటకంగా ప్రదర్శించినప్పుడల్లా ఆ పాత్రను జీ వరలక్ష్మి వేసేది. 'చంద్రలేఖ' సినిమా తమిళ, ఆంధ్రలోనూ రజతోత్సవం జరుపుకొంది. నటిగానే కాక గాయనం, నృత్యంలోనూ రాణించారు. ఆర్‌ఆర్ పిక్చర్స్ సంస్థ ద్వారా కొన్ని సినిమాలు నిర్మించారు. నటించింది తక్కువ చిత్రాలే అయినా తరగని కీర్తిని పొందారు. 1999 సెప్టెంబరు 20న కన్నుమూశారు.

పిఠాపురం నాగేశ్వరరావు (జయంతి)



పిఠాపురం నాగేశ్వరరావు 1930 మే 5న తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. అసలు పేరు పాతర్లగడ్డ నాగేశ్వరరావు. అయితే ఊరిపేరుతోనే గుర్తింపు పొందారు. తెలుగుసినీ రంగంలో నేపథ్య గాయకుడిగా రాణించడమేకాక ప్రముఖ సినీ సంగీత దర్శకులు. మాధవపెద్ది సత్యం - పిఠాపురం నాగేశ్వరరావు లను జంట గాయకులుగా పేరొందారు. అవే కళ్ళు, కులగోత్రాలు సినిమాలలోని హుషారైన పాటలు ఎంతో గుర్తింపు పొంది నేటికీ ఆదరణ పొందుతున్నాయి. తెలుగులోనేకాక తమిళ, కన్నడ, హిందీ, సింహళ భాషలలో సుమారు 7వేలపాటలు పాడారు. 1996 మార్చి 5న కన్నుమూశారు.

నౌషాద్ అలి (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత నౌషాద్ అలి 1919 డిసెంబరు 25న లఖ్‌నవ్‌లో జన్మించారు. హిందీ సినీరంగంలో పేరొందిన సంగీత దర్శకులు. క్లాజికల్ మ్యూజిక్‌తో రూపొందిన సినిమాలు 35 సిల్వర్ జుబ్లీలు, 12 గోల్డెన్ జుబ్లీలు, 3 డైమండ్ జుబ్లీలు అందుకున్నాయి. 'మదర్ ఇండియా' సినిమా తొలిసారి ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. సంగీతనాటక అకాడమీ, ఉత్తమ సంగీత దర్శకుడు తదితర పురస్కారాలు పొందారు. 2006 మే 5న కన్నుమూశారు.

రమాప్రభ (పుట్టినరోజు)



రమాప్రభ 1947 మే 5న జన్మించారు. తెలుగు సినీరంగంలో ఎంతో పేరొందారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. ఆరు దశాబ్దాలలో 1400కుపైగా సినిమాలలో దాదాపు అన్ని తరం నటులతో నటించారు. 1970-80ల మధ్యన రాజబాబు, రమాప్రభల కమెడియన్ ద్వయం ఎంతో రాణించింది. ప్రముఖ నటుడు శరత్‌బాబును పెళ్లాడి 14ఏళ్ల అనంతరం విడాకులు ఇచ్చారు. సినిమాలలోకి రాకమునుపు నాటకరంగంలో 4వేలకుపైగా రంగస్థల ప్రదర్శనలు ఇచ్చారు.

కాలుష్య కోరల్లో చిత్రావతి కాలువ

» నీటి వనరులను కాపాడుకోవాలని ప్రజల డిమాండ్

బాగేపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): కరువుప్రాంతంగా ఉన్న బాగేపల్లి తాలూకాలో చిత్రావతి నది ఒక్కటే ఏకైక ప్రధాన నీటివనరుగా ఉంది. ఈ నదీ కాలువ కాలుష్యం బారినపడింది. చెత్తాచెదారం, ప్లాస్టిక్‌వ్యర్థాలు చేరాయి. చిత్రావతి నదికి పరగోడు ఆనకట్ట ఉంది. డ్యాం నిండి ప్రవహిస్తే పట్టణంలోని పశ్చిమభాగంలో చిన్న కాలువ ద్వారా సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ బుక్కపట్నం చెరువుకు నీరు చేరుతుంది. కొన్నేళ్లక్రితం జీవనదిగా ఉండేది. అయితే కాలక్రమంలో సరైన వర్షాలు కురవకపోవడంతో డ్యాంకి తగినంత చేరలేదు. ఇలాంటి నదీ కాలువలను సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. పురసభ, గ్రామపంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొడవైన బ్రిడ్జి

1959 డిసెంబరు 20న అప్పటి ప్రజాపనులశాఖ మంత్రి హెచ్‌ఎం చిన్నబసప్ప చిత్రావతి నదికి అనుబంధంగా బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. 24 అడుగుల వెడల్పు, 130 అడుగుల పొడవుతో నిర్మించిన ఈ బ్రిడ్జిని 1962లో ప్రారంభించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జికింద వెళ్తున్న కాలువ చెత్త పేరుకుపోయి రోగాలకు కారణంగా మారింది.

దుస్థితిలో చెక్‌డ్యాం

కాగా 1883లో జడలబైరవేశ్వర ఆలయం సమీపాన బ్రిటీష్‌కాలంలో నిర్మించిన చెక్‌డ్యాం క్రమేపీ దుస్థితికి లోనైంది. నీటి సేకరణకోసం అప్పట్లో భారీ చెక్‌డ్యాంను నిర్మించిన వాటి ప్రాధాన్యతను మరిచారు. చారిత్రాత్మక స్మారకాలను రక్షించే ప్రయత్నం చేయడం లేదు. నది కాలువ పొడవునా ఆక్రమణలకు గురయ్యాయి. పట్టణంలోని డ్రైనేజీ, మాంసపు వ్యర్థాలను ఇక్కడే పడేస్తున్నారు. హోటళ్లు, దుకాణాల ప్లాస్టిక్, చెత్తా చెదారం పడేస్తుండడంతో కలుషితం అవుతోంది. కనీసం చిత్రావతి నది ప్రదేశంలో చెత్త పడేస్తే జరిమానా విధించకపోవడంతో ప్రజలలో ఈ అంశంపై చైతన్యం లేదు. నదీ కాలువకు కంచె నిర్మించి, వ్యాహ్యాళికి వీలు కల్పిస్తూ ఉద్యానవనం నిర్మించాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



పేరుకుపోయిన చెత్తాచెదారం

యంత్రాంగం విఫలం

డీవైఎఫ్‌ఐ జిల్లా సంచాలకులు సోమశేఖర మాట్లాడుతూ.. బాగేపల్లి పట్టణంలో భూగర్భజలాలు పెరిగేందుకు సహకారిగా ఉన్న చిత్రావతి నదిని సంరక్షించుకోవడంలో తాలూకా యంత్రాంగం విఫలమైందన్నారు. చిత్రావతి నదికి ఉన్న చరిత్ర, ప్రాముఖ్యత ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎవరైనా సంఘసంస్థలు స్వచ్ఛతకు ముందుకొస్తే తమవంతు సహకారం అందిస్తామన్నారు.

29న కైవార తాతయ్య ఆరాధన



యోగినారేయణ సన్నిధిలో ఆహ్వానపత్రిక విడుదల చేస్తున్న కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తదితరులు

చింతామణి రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రసిద్ధయాత్రా స్థలమైన పుణ్యక్షేత్రం కైవారలో త్రికాలజ్ఞాని, సద్గురు యోగి నారేయణ తాతయ్య 190వ జీవ సమాధి ప్రవేశపర్వ ఆరాధన మహోత్సవాన్ని ఈనెల 29న గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్టు కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తెలిపారు. కైవార యోగినారేయణ మఠం సద్గురు కైవార తాతయ్య సన్నిధానంలో ఆరాధనా కార్యక్రమ ఆహ్వానపత్రికను ఆదివారం విడుదల చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 29న ప్రాతఃకాలం ఘంటానాదం, సుప్రభాతం, గోపూజతో పూజాకైంకర్యాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 8 గంటలకు సద్గురు తాతయ్యను అలంకరించిన తాతయ్యను సభాంగణానికి తెస్తారన్నారు. తాతయ్యకు విశేష అభిషేకం, అష్టావధాన సేవ, పూజాకైంకర్యాలు ఉంటాయన్నారు. ప్రతిసంవత్సరం ఈ కార్యక్రమంలో పాల్గొనే సాధు పుంగవులకు కాషాయవస్త్రాలను అందచేసే ఆనవాయితీ ఉందన్నారు. ఇదే సందర్భంగా 2024-25 వార్షిక నివేదికను సద్గురు తాతయ్యకు సమర్పిస్తామన్నారు. తాతయ్య గురువు సందేశాలను సభికులకు తెలియచేయనున్నట్టు తెలిపారు. కాగా 28న బుధవారం విశేషహోమాలు, అదే రోజురాత్రి భజనామందిరంలో అఖండనామ సంకీర్తనా భజనా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా మఠం ట్రస్టు ఉపాధ్యక్షులు జే విభాకరరెడ్డి, కోశాధికారి ఆర్‌పిఎం సత్యనారాయణ, సభ్యులు వానరాశి బాలకృష్ణ భాగవతార్, గణేశ్ చంద్రప్ప, త్యాగరాజ్, సురేశ్, మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



ర్యాలీలో బైకర్లు తదితరులు

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో స్థన క్యాన్సర్ పెరుగుతోందని అవగాహన ఒక్కటే నివారణ సాధ్యమని గ్లెనిగల్ ఆసుపత్రుల బెంగళూరు క్లస్టర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిపారు. రిచ్‌మండ్ రోడ్డులోని ఆసుపత్రి నుంచి ర్యాలీని మెడికల్ అంకాలజిస్ట్ బిఎంటి సీనియర్ అడ్వైజర్ రాజీవ్ విజయ్‌కుమార్‌తోపాటు పలువురు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థన ఆరోగ్యం కోసం ఓ సవారి పేరిట వందమందికిపైగా వాహనాలలో ర్యాలీ చేశారు. బైకర్‌హుడ్ టస్కర్స్ సహకారంతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రాజీవ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్థన క్యాన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తిస్తే చికిత్సల ద్వారా రూపుమాపవచ్చునన్నారు. మహిళలు స్థన ఆరోగ్యంపై అవగాహన పొందాలన్నారు. డాక్టర్ ఎంసీ ముత్తప్ప, లక్ష్మీకామల్, వెంకటేశ్ విక్రమ్, షోయబ్ ఉర్ రెహమాన్, సీఓఓ డాక్టర్ జతీందర్ అరోరా తదితరులు పాల్గొన్నారు. వీల్స్ ఆఫ్ హోప్ పేరిట ర్యాలీ సాగింది.

వాసవీమాతకు విశేష పూజలు

ముళబాగిలు, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఆదివారం విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గణపతి ప్రార్థన, గంగపూజ, గోపూజ, ద్వారార్చన, ఆలయ ప్రవేశం, పుణ్యాహవచనం, అన్ని దేవతామూర్తులకు పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, వాసవి, మహాలక్ష్మి హోమం నిర్వహించారు. దేవిఖడ్గమాలా హోమం, పూర్ణాహుతి, బలిహరణ, సహస్ర నామార్చన, మహానైవేద్యం, మహామంగళారతి అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఇదే సందర్భంగా పసుపు, కుంకుమలతో లక్షార్చన నిర్వహించారు. శ్రీవారి సమృద్ధి భజనామండలి ఆధ్వర్యంలో భజన, కోలాటం జరిగాయి.



ఆలయంలో కోలాటం

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

బంగారపేట, మే 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కెసరనహళ్ళికి చెందిన కొంతమంది యువత బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడంపై ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి హర్షం వ్యక్తం చేశారు. కెసరనహళ్ళి గ్రామంలో దండు మారియమ్మ ఆలయ సమీపాన ఏర్పాటైన కార్యక్రమంలో గ్రామపంచాయతీ మాజీ సభ్యులు, మొదలియార్ సామాజికవర్గానికి చెందిని వేలయ్య, ప్రముఖులు కృష్ణమూర్తి, షణ్ముగ, మురళి, శివలింగ, రవిపూజారి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారిని కాంగ్రెస్ కండువాలతో ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు, సముదాయభవనం నిర్మించాల్సి ఉందన్నారు. అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ఎప్పుడూ సహకారం ఉంటుందన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో కలసికట్టుగా చర్చించి అభ్యర్థి ఎవరైనా వారి విజయం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బంగారపేట బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు చందు కుమార్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు రఘునాథ్, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షులు సత్యగోవిందరాజు, మాజీ అధ్యక్షుడు మంజునాథ్, సభ్యుడు మమతా అంబరీశ్, గ్రామ ప్రముఖులు బీరణ్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలు

అడవిలో ఏనుగు మృతి

బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా బండీపుర పులుల అభయారణ్యంలో జీఎస్‌బెట్ట డివిజన్ హంగళసౌత్ విభాగంలో గస్తీ సిబ్బంది ఒక ఏనుగు మృతి చెందడాన్ని ఆదివారం గుర్తించారు. సుమారు 35-40 ఏళ్ల ఉంటాయని భావించారు. ఏనుగుకు అటవీశాఖకు చెందిన పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఏనుగు కళేబరానికి అంత్యసంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు ప్రభాకరన్, నవీన్‌కుమార్, బీఎం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఏనుగు కళేబరం వద్ద అధికారులు

బైక్‌ను ఢీకొన్న పోలీస్ వాహనం..ఒకరికి తీవ్రగాయాలు

ముళబాగిలు, మే 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌కు పోలీస్ జీప్ ఢీ కొన్న ఘటనలో ద్విచక్రవాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కోలారు పట్టణం మహిళా పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇన్ స్పెక్టర్ ఒక కేసు విషయంలో పంచనామాకోసం సిబ్బందితో జీప్‌లో వెళ్తుండగా బైక్‌ను ఢీ కొన్నారు. ఈ సందర్భంగా వాహన చోదకుడు తల, కాలికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయాడు. ముళబాగిలు తాలూకా కాంతరాజ్ సర్కిల్‌లో ఆదివారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు ఘటన చోటు చేసుకుంది. కోలారు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శంకరాచారి, సిబ్బంది జీప్‌లో ఉన్నారు. బైక్ చోదకుడు కేజీఎఫ్ తాలూకా బడమాకనహళ్ళికి చెందిన నారాయణస్వామిగా తెలుస్తోంది. ఇతడిని ఆర్‌ఎల్ జాలప్ప ఆసుపత్రికి తరలించారు. ముళబాగిలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ప్రమాదానికి కారణమైన పోలీస్ వాహనం

గంగమ్మ దేవి ఊరేగింపు



గంగమ్మదేవి ఊరేగింపు

చింతామణి, మే 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మురగమల్లా హోబళి యర్రకోటె గ్రామానికి చెందిన గంగమ్మదేవి ఉత్సవమూర్తిని సమీపంలోని మాదమంగల గ్రామంలో శనివారం రాత్రి ఊరేగించారు. 17 సంవత్సరాల తర్వాత గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బ్యాండ్‌సెట్‌తోపాటు డప్పు కళాకారుల మధ్య అర్ధరాత్రి వరకు అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. మాదమంగల గ్రామంలో యర్రకోటె గంగమ్మ ఊరేగింపులో గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల యువత పెద్దసంఖ్యలో పాల్గొని సంగీతానికి అనుగుణంగా నృత్యాలు చేశారు. గ్రామపెద్దల సూచన మేరకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించినట్టు టీపీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు చంద్రప్ప తెలిపారు. అమ్మవారి ఉత్సవం వైభవంగా కొనసాగిందన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



మాట్లాడుతున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకోబ

సిరుగుప్ప, మే 4(ఆంధ్రజ్యోతి): భగీరథ చరిత్ర ఎంతో గొప్పదని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఉప్పర వెంకోబ తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరసప్ప సమక్షంలో భగీరథ జయంతి వేడుకలను నిర్వహించారు. భగీరథ భావచిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ, రాఘవేంద్ర, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు మంజునాథ, మహంతేష, సిబ్బంది పాల్గొన్నారు.

తోరణగల్లు: తాలూకాలోని కాశీవిశ్వనాథ స్వామి దేవాలయంలో ఉప్పర కుల బాంధవుల ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు శంకర్ గ్యాంగ్, శంకరన్న, ఆలూరప్ప, తిప్పయ్య స్వామి, రామాంజనేయ, ఇతర భక్తాదులు పాల్గొన్నారు.



భగీరథ మహర్షి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఉప్పర సమాజ ప్రజలు

బసవన్న వచనాలు అనుసరణీయం



కార్మికులను సన్మానిస్తున్న సంఘం నేతలు

విజయపుర, మే 4(ఆంధ్రజ్యోతి): బసవన్న వచనాలు నేటికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని గాంధీచౌక్‌లో నగర్త మహంతిమఠం ధర్మసంస్థ ఆవరణలో బెంగళూరు గ్రామీణ జిల్లా శరణసాహిత్య పరిషత్, బెంగళూరు గ్రామీణ జిల్లా కదలి మహిళా వేదిక ఆధ్వర్యంలో బసవ జయంతి, కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. కూలికార్మికులైన సుబ్బరాయప్ప (మోటప్ప), కూరగాయల వ్యాపారి రత్నమ్మలను గౌరవంగా సత్కరించారు. పరిషత్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు సతీశ్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సాంస్కృతిక నాయకుడు బసవేశ్వరుడి గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. శతాబ్దాల క్రితమే వచనాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. బెంగళూరు అల్లమ సంస్థ సంస్థాపకురాలు విశాల ఆరాధ్య, శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర్ హడపద్‌లు ప్రసంగించారు. బీ స్వర్ణగౌరి, సుధాకర్, చిక్కణ్ణ, విశ్వనాథ్, ఆర్ మునిరాజు, మునివీరణ్ణ, మూర్తీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రావణ వాహనంపై సోమేశ్వరుడి విహారం



రావణ వాహనంపై ఊరేగుతున్న సోమేశ్వరస్వామి

ముళబాగిలు, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్న సోమేశ్వర స్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏపీ రామనాథ్‌దీక్షిత్ నేతృత్వంలో ధార్మిక కైంకర్యాలు, ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమేశ్వరస్వామిని అలంకరించిన రావణ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలంగూరు శివణ్ణ ప్రాయోజకత్వం వహించగా వి గుట్టహళ్ళి గ్రామస్థులు రావణ వాహనోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు



రోడ్డుపై కూలిన చెట్టు

శిడ్లఘట్ట, మే 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సాదలి గ్రామ పంచాయతీ పరిధిలో ఈదురుగాలులతో కూడిన వర్షంతో కొన్ని చోట్ల చెట్లు, చెట్లకొమ్మలు, విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. ఇ తిమ్మసంద్ర, దిబ్బూరహళ్ళి, ఎస్ దేవగానహళ్ళి తదితర గ్రామాలలో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఎస్ దేవగానహళ్ళి నుంచి సాదలి మధ్య రోడ్డుపై రెండు విద్యుత్‌స్తంభాలు, పాతకాలంనాటి చెట్టు కూలిపోయాయి. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. రోడ్డుపైనే చెట్లు, స్తంభాలు కూలడంతో సంచారానికి కొంతసేపు అంతరాయం నెలకొంది. రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించేందుకు స్థానిక గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు.

చేళూరు తాలూకాలో...

చేళూరు: చేళూరు తాలూకా సోమనాథపురం సమీపాన ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలో రాత్రి కురిసిన గాలివానకు భారీ చెట్టు కూలి రోడ్డుపై పడింది. దీంతో బాగేపల్లి నుంచి చేళూరుకు వచ్చే వాహనాలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. స్థానికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది.

వైభవంగా సోమేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి గాంచిన సోమేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు.



భక్తుల మధ్య సాగుతున్న సోమేశ్వరుడి రథోత్సవం



అలంకరణలో స్వామి